కరువు ఛాయలు!

వర్షాలు పడక.. కూలీ దొరకక

- భారంగా మారిన దినసరి కూలీల బతుకులు
- ఉపాధి హామీ పనులు కొనసాగించాలని వేడుకోలు



ఆలేడ్‌లో ఉపాధి పనులు చేస్తున్నా కూలీలు (ఫైల్)

దుద్యాల్ : తొలకరి వచ్చినట్టే వచ్చి.. ముఖం చాటేయడంతో కరువుఛాయలు కనిపిస్తున్నాయి.. దాదాపు నెల రోజులు గడుస్తున్నా.. చినుకు జాడ లేదు. గ్రామాల్లో కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే మహిళలు, పురుషులు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో వర్షాలు పడితే వ్యవసాయ పనులకు వెళ్లి బతుకు వెళ్లదీసే వారు గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా ఉన్నారు. సకాలంలో వానలు కురిసుంటే పొలాల్లో మహిళలకు కలుపులు, వరినాట్లు వేయడం, పురుషులకు పొలాల్లో గట్లు చెక్కడం వంటి పనులు ముమ్మరంగా ఉండేవి. వర్షాలు పత్తాలేకపోవడంతో మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో ఉపాధి దొరకకా పూట గడవడమే ఇబ్బందిగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీవనం భారంగా మారింది..



నిత్యం వ్యవసాయ పనులకు వెళ్లి కూలీ చేసుకుని జీవనం సాగిస్తాం. వర్షాలు పడకపోవడంతో పనులు దొరకడం లేదు. వర్షాలు కురిసుంటే పత్తి, పెసరు, కంది, మొక్కజొన్న వంటి పంటల్లో కలుపు, వరినాట్లు దొరికేవి. పనులు దొరకక జీవనం భారంగా మారింది. వెంటనే అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించి నాలాంటి కూలీలను ఆదుకోవాలి.

– ఎట్ల లక్ష్మి, ఉపాధి కూలీ, హస్నాబాద్

ఉపాధి పనులు ప్రారంభించాలి

వర్షాలు లేక గ్రామాల్లో కరువుఛాయలు ఏర్పడుతుండడంతో ఉపాధి పూర్తిగా నిలిచిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించి ప్రజలను ఆదుకోవాలని దినసరి కూలీలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ఆదమరిస్తే.. అంతే!

- రోడ్ల పక్కనే కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు
- ఆందోళనలో ప్రజలు

దుద్యాల్ : అసలే వర్షాకాలం.. ఇండ్ల ఎదుట, రోడ్ల పక్కన కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు, ఇనుప విద్యుత్ స్తంభాలు.. అప్పుడప్పుడు మెరుపులు, మంటలు.. ఇండ్లపై నుంచే వేలాడే విద్యుత్ తీగలు.. ఇలా.. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. దీంతో ప్రజలు భయంభయంగా కాలం వెళ్లదీస్తున్నారు. మండలంలోని చెట్టుపల్లి తండా, సాగారం తండాలకు వెళ్లే మార్గంలో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డుకు ఆనుకుని ఉన్నాయి. ప్రజలు, రైతులు రాత్రనకా.. పగలనకా నిత్యం కొడంగల్, చిలుముల మైల్వార్‌లకు వెళ్తుంటారు. రోడ్డుకు ఆనుకుని ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. కంచే ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు వేడుకుంటున్నారు.



చెట్టుపల్లి తండా సమీపంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



సాగారం తండా సమీపంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

క్లుప్తంగా

1న మండల సర్వసభ్య సమావేశం

తాండూరు రూరల్: మండల సర్వసభ్య సమావేశం జూలై 1వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాండూరు మండల ఎంపీపీ అనితగౌడ్ అధ్యక్షతన సోమవారం ఉ.11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు

విద్యార్థులు కష్టపడి చదవాలి

తహసీల్దార్ ఆనంద్‌రావు



బ్యాగులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్

పరిగి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు ఆకాంక్షించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ప్రాథమిక బాలికల పాఠశాలలో అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్యాగులు, చెప్పులు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రోత్సహకాలు అందించడం ద్వారా వారిలో చదవాలని ఉత్సాహం నింపిన వారమ తామని తెలియజేశారు. విద్యార్థులు కూడా అదే స్ఫూర్తితో చదివి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డీనేటర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అసదుద్దీన్‌పై పోలీసులకు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

పూడూరు: హైదరాబాద్ ఎంపీగా ప్రమాణస్వీకారం చేసే సమయంలో జై పాలస్తీనా అని నినదించిన ఎంపీ అసదుద్దీన్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని సినిమా సెన్సార్‌బోర్డు సభ్యుడు మల్లేశ్ పటేల్ డిమాండ్ చేశారు. ప్రతిష్ఠాత్మకమైన పార్లమెంట్‌లో భారత రాజ్యాంగాన్ని అవమాన పర్చేలా జైపాలస్తీనా అనడం సిగ్గు చేటన్నారు. ఈ మేరకు శుక్రవారం చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అసదుద్దీన్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దేశ ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో గెలిచి వేరే దేశానికి జైకొట్టడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రాఘవేందర్, జిల్లా నాయకులు ప్రసాద్‌గౌడ్, నవీన్‌పంతులు, విఠల్, సత్యనారాయణ, సుభాన్, శ్రీహరిచారిపాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పూడూరు: మండలంలోని చన్గోముల్ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కారించాలని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు యాదగిరిగౌడ్, లింగప్ప వికారాబాద్ ఏడీ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో పూర్తిగా స్తంభాలు శిథిలావస్థకు చేరాయని ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని చెప్పారు. అరవై ఏళ్ల క్రితం వేసిన స్తంభాలతో తరచూ ప్రమాదాలు తప్పడం లేదని వాటిని మార్చి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇళ్లపై నుంచి ఉన్న లూజ్‌లైన్లను సరి చేయాలని కోరారు. సమస్యను పరిష్కారించేలా చర్యలు తీసుకుంటామని ఏడీ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌గౌడ్, నవీన్‌కుమార్, నర్సింలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కొడంగల్ రూరల్ : కొడంగల్ పెద్ద చెరువు కట్టపై వెలసిన ఎల్లమ్మ దేవతకు పట్టణంలోని చేపల సంఘానికి చెందిన తెలంగ్‌వాడ కాలనీ రైతులు, మహిళలు శుక్రవారం బోనాలు సమర్పించారు. బోనాలు ఎత్తుకొని బాజా భజంత్రీలతో ఊరేగింపుగా చెరువు కట్టపై వెలసిన అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సమృద్ధిగా వానలు కురిసి పంటలు పండి, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించేలా అనుగ్రహించాలని అమ్మవారిని వేడుకున్నారు.



ముద్దప్పను సన్మానిస్తున్న మాజీ సర్పంచులు

పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం

- ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్
- ఎంపీటీసీలకు వీడ్కోలు సన్మానం

కొడంగల్ : అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు ఆయా శాఖల పరిధిలో చేపట్టిన పనులను సభ్యులకు వివరించారు. సభకు అధ్యక్షత వహించిన ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ మాట్లాడుతూ.. జూలై నాలుగో తేదీతో ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం ముగుస్తుందన్నారు. ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసిన తర్వాత ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమవుతుందన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మంచినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాను మూడు పర్యాయాలు ఎంపీపీగా, రెండు సార్లు కొడంగల్ సర్పంచ్‌గా పనిచేసి ప్రజల మన్ననలు పొందినట్లు తెలిపారు. పదవి ఉన్నా లేకున్నా నిత్యం ప్రజాసేవలో ఉంటానని అన్నారు. అనంతరం ఎంపీటీసీలకు వీడ్కోలు సన్మానం చేశారు. మండల పరిధిలోని మాజీ సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంపీపీ ముద్దప్పను ఆత్మీయంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉషశ్రీ, ఎంఈఓ రాంరెడ్డి, ఏపీఓ రాములు, మాజీ జెడ్పీటీసీ భాస్కర్, ప్రశాంత్, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, అంజద్, హస్నాబాద్ పకీరప్ప, శంకర్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌బాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు

పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు రాజశేఖర్

పెద్దేముల్: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని పెద్దేముల్ పీఆర్టీయూ పెద్దేముల్ శాఖ అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కందనెల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వారిజ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వారిజ టీచర్ సొంత మండలంలో ఉపాధ్యాయురాలుగా పనిచేసి, అక్కడే పదవీ విరమణ పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు మంచి బోధనతో పాటు పలు సాంస్కృతిక, పీఆర్టీయూ శాఖ కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా పాల్గొనేవారని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి నవీన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శివకుమార్, మండల నోడల్ అధికారి నర్సింగ్‌రావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నర్సింలు, విజయ్, ఆనంద్ శ్రీనివాస్, ఆంజనేయులు పాల్గొన్నారు.



వారిజ టీచర్‌కు సన్మానం చేస్తున్న నాయకులు

పంట వివరాల నమోదు తప్పనిసరి

తాండూరు రూరల్: ప్రతి రైతు తమ పొలాల్లో సాగు చేసిన పంటల వివరాలను సంబంధిత వ్యవసాయశాఖ అధికారుల వద్ద నమోదు చేయించాలని బెల్కటూర్ క్లస్టర్ ఏఈఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని బెల్కటూర్ గ్రామంలోని వ్యవసాయ పొలంలోకి క్షేత్రస్థాయిలో వెళ్లి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ.. పంటసాగు వివరాలను నమోదు చేసుకుంటే దిగుబడులను సులువుగా విక్రయించుకునే అవకాశం ఉంటుందన్నారు. పంట మార్పిడి చేయడంతో దిగుబడి పెరుగుతుందన్నారు. తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు.



పంటల వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓ శ్రీనివాస్

ఆలయాల అభివృద్ధికి సహకరించండి

కొడంగల్ : పట్టణంలోని పురాతనమైన ఎంతో ప్రసిద్ధి చెందిన గాడిబాయి శివాలయం, వీరభద్రేశ్వర ఆలయాల అభివృద్ధికి సహకరించాలని పట్టణ పురోహితుడు కిట్టుస్వామి శుక్రవారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గాడిబాయి ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణం, వసతి గృహం నిర్మాణం, వంటశాల, విద్యుద్దీకరణ, సుందరీకరణకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, గోపాల్, శ్రీనివాస్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటరెడ్డికి అధికారికి వినతిపత్రం ఇస్తున్న కిట్టుస్వామి

కోరం లేక సమావేశం వాయిదా

పెద్దేముల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం కోరం లేక వాయిదా వేయడం జరిగిందని ఎంపీపీ అనురాధ తెలిపారు. మొత్తం 13 మంది ఎంపీటీసీ సభ్యులకు కేవలం నలుగురు హాజరు కావడంతో వాయిదా వేసి, జూలై 2న నిర్వహించడం జరుగుతుందన్నారు. మూడు నెలలకు ఓ సారి సర్వసభ్య సమావేశానికి పూర్తిస్థాయిల్లో అధికారులు రాకపోవడం, సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఒక్కటి కూడా పూర్తి చేయకపోవడంతో ఎంపీపీ అనురాధతో పాటు పలువురు ఎంపీటీసీ సభ్యులు అధికారుల తీరుపై మండిపడ్డారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు.

అసైన్డ్ భూముల సమస్యలు పరిష్కరించండి

ఎంపీపీ చంద్రకళ



మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రకళ

అనంతగిరి: శానిటేషన్ పనులు చేపట్టి ముందస్తు జాగ్రత్తగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఎంపీపీ చంద్రకళ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీపీ చంద్రకళ అధ్యక్షతన వికారాబాద్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని మదన్‌పల్లి గ్రామంలో నెలకొన్న అసైన్డ్ భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైస్ ఎంపీపీ కొండి రాములు సభ దృష్టికి తెచ్చారు. గ్రామంలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూముల్లో సాగు చేసుకుంటున్నారని, ఫారెస్టు వివాదం అంటూ ధరణి వచ్చాక పేదలకు కొత్త పాసుపుస్తకాలు ఇవ్వలేదన్నారు. దీంతో బ్యాంకుల్లో రుణాలు ఇవ్వకపోవడంతో పాటు రైతు పెట్టుబడి కూడా రావడం లేదని వాపోయారు. అనంతరం సిద్దులూర్ ఎంపీటీసీ గౌసోద్దీన్ మాట్లాడుతూ.. గ్రామ ప్రత్యేకాధికారులు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, సమస్యలను ఎప్పటికపుడు పరిష్కరించి గ్రామాభివృద్ధికి దోహదపడాలన్నారు. అనంతరం మండల వ్యవసాయాధికారి జ్యోతి మాట్లాడుతూ.. విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు విత్తనాలు, ఇతర కొనుగోళ్ల విషయంలో తప్పకుండా రసీదులు తీసుకోవాలని సూచించారు. ఏమైన సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ చంద్రకళ మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు విధిగా చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయాధికారులు రైతులకు ఎప్పటికపుడు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ ప్రమోదిని, ఎంపీడీఓ వినయ్‌కుమార్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీఓ నాగరాజు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు మర్పల్లి తైబజార్ వేలం

మర్పల్లి: మర్పల్లి గ్రామపంచాయతీలో తైబజార్ వేలం పాట నేడు (శనివారం) ఉ.10 గంటలకు నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై నుంచి ఫిబ్రవరి వరకు 9 నెలల కాలపపరిమితికి తైబజార్ వేలం పాట ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనే వ్యక్తులు ముందుగా రూ.2 వేలు పంచాయతీలో చెల్లించాలని తెలిపారు. తైబజార్ దక్కించుకున్న వ్యక్తి పంచాయతీ నిర్ణయించిన రేట్ల ప్రకారమే సంతలో చిరు వ్యాపారుల నుంచి వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేసుకోవాలన్నారు. తైబజార్ చేజిక్కించుకున్న వారు అదే రోజు సాయంత్రం సగం డబ్బులు చెల్లించి రశీదు తీసుకోవాలన్నారు.

తైబజార్ రూ.39వేలు

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని వారాంతపు సంత తైబజార్ వేలంపాటను శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను తైబజారును గ్రామానికి చెందిన రవిగౌడ్ రూ.39వేలకు దక్కించుకున్నాడు. ఇందులో డిప్యూటీ తహసీల్దార్ రవి, పంచాయతీ అధికారి మహేశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు వెంకటయ్య, రాజేశ్ తదితరులున్నారు.

నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

ఎంపీటీసీ విజయ

దోమ : గ్రామంలో నీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఎంపీటీసీ విజయ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఐనాపూర్ గ్రామంలో గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు వస్తున్నా యని తమ దృష్టికి తీసుకురావడంతో గ్రామంలోని చెరువు కట్టపై తాగునీటి బోరు వేయించామని తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడొద్దన్నారు. ఏ వీధిలోనైనా తాగు నీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.



నీటి బోరును వేయించిన ఎంపీటీసీ

సారా విక్రయిస్తే జైలుకే..

తహసీల్దార్ కిషన్

పెద్దేముల్: సారాను తయారు చేసినా.. విక్రయించినా కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ కిషన్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని నెల్లిగడ్డ తండాకు చెందిన ముడావత్ పాండు, ఛవాన్ రమేష్, మదనంతపూర్ తండాకు చెందిన గోరియాలు సారాను విక్రయిస్తుండగా వారిని తాండూరు ఎక్సైజ్ పోలీసులు పట్టుకుని తహసీల్దార్ కిషన్ ఎదుట బైండోవర్ చేశారు. మొదటిసారి దొరకడంతో బైండోవర్ చేయడం జరుగుతుందని, మళ్లీ విక్రయం చేస్తే రూ.2లక్షల జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని విధాలా ఉపాధి కల్పిస్తుందన్నారు. ఇలాంటి పనులు చేయడం మంచి కాదని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్స్ తదితరులు ఉన్నారు.



నిందితులను బైండోవర్ చేసిన పోలీసులు

డ్రగ్స్‌పై అప్రమతత్త అవసరం

యాలాల: యువత డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తాండూరు రూరల్ సీఐ ఎస్.అశోక్‌కుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భావిభారత పౌరులైన యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాన్ని చిత్తు చేసుకోవద్దన్నారు. ఉజ్వల భవిష్యత్తుకు, ఉన్నత విద్యాభ్యాసం వైపు ప్రణాళికంగా అడుగులు వేయాలని తెలిపారు. డ్రగ్స్‌తో పాటు సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, హనీ ట్రాప్, లోన్ ట్రాప్, కొత్త లింకులు, ఆన్‌లైన్ ఆటల జోలికి వెళ్లరాదని సూచించారు. యువత డ్రంకెన్ డ్రైవ్‌కు దూరంగా ఉండి, ర్యాష్ డ్రైవింగ్ లేకుండా, వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలన్నారు. వీటితో పాటు మీడియాలో ఎదైన వార్త రాసేముందు సదరు అధికారి వివరణ తీసుకొని, నిజాలు నిర్భయంగా రాయాలని కోరారు.



సీఐ అశోక్‌కుమార్

మౌలిక వసతుల కల్పనకు కృషి

కుల్కచర్ల: ప్రభుత్వం బడుల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల ద్వారా గ్రామాల్లో విద్యాభివృద్ధికి మెరుగైన ఫలితాలు రానున్నాయని కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని కామునిపల్లి, పీరంపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలలో అమ్మఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలలో జరిగే అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు మౌలిక సదుపాయాల గురించి వివరించి పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఆహ్వానం

కుల్కచర్ల: అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు హాజరుకావాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను జిల్లా అంబేడ్కర్ సంఘాల నాయకులు, కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య ఆహ్వానించారు. శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి 30న మండలంలోని బ్రహ్మణపల్లిలో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు రావాలని కోరారు.



స్పీకర్‌ను కలిసిన సంఘాల నేతలు

సమాజంలో గురువు పాత్ర వెలకట్టలేనిది

ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: సమాజంలో గురువు స్థానాన్ని వెలకట్టలేమని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న పరందాములు పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒక వ్యక్తి సర్వతోముఖాభివృద్ధిని సాధించేందుకు ఉపాధ్యాయులు చేసే కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. పరందాములు ఒక ఉపాధ్యాయుడిగా ఎన్నో గ్రామాల్లో ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పించి వారి ఉన్నతికి కృషి చేశారని అన్నారు. విరమణ ప్రతి ఉద్యోగికి తప్పనిసరి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షులు భీంరెడ్డి, పీఆర్టీయు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, ప్ర.దాన కార్యదర్శి అమర్నాథ్, మండల పీఆర్టీయూ అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బస్వరాజు, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, సంఘం నాయకులు హన్మంతు, శ్రీనివాస్ రెడ్డి, రాకేశ్, శేఖర్, శ్రీను పాల్గొన్నారు.



పరందాములును సన్మానిస్తున్న ఎమ్మెల్యే